# కుటుంబ నియంత్రణ

రాత్రి రెండు గంటలవరకూ నవలా రచనలో నిమగ్నుడై కూర్చున్నాడు పరంధామయ్యగారు.

ఒక నిద్రతీసి లేచిన భార్య ఆయనదగ్గరకు వొచ్చి, "ఇంకా ఎంతసేపు ఈ రాతలు! పడుకోండి ...ఇప్పుడైనా. లేకపోతే ఆరోగ్యం పూర్తిగా చెడిపో తుంది," అన్నది.

"ఎలా పడుకోవడం. హీరోయిన్ విలన్ చేతిలో చిక్కుకుని వుంది. మళ్ళీ ఆమెను విడిపించేవరకూ నాకు నిద్రపట్టదు," అన్నాడు రచయిత.

"ఆమె వయస్సెంత," అని ఆవులిస్తూ అడిగింది శ్రీమతి పరంధామయ్య.

"ఇరవై రెండు," అని పరంధామయ్యగారు చెప్పగానే—

"అయితే దీపం ఆర్పేసి పడుకోండి. మైనారిటీ తీరినపిల్లకు ఇంకా మీ రక్షణ ఏమిటి? ఆమె తన సంగతి చూసుకుంటుంది లెండి," అన్నది భార్య.

"నిజం నిజం," అని రచయిత దీపం ఆర్పేసి మంచంమీద సాచి పడుకున్నాడు.

ఆరేళ్ళు గడిచాయి. (ఎప్పటినుంచి ఆరేళ్ళు? దీపం ఆర్పేసిన దగ్గర్నించా? ఎలా అనుకున్నా ఫరవాలేదు) ఒకరోజు పరంధామయ్యగారు గడ్డం గీసుకుం టూంటే గదిలో ఏవో శబ్దమయ్యింది. వెనక్కి తిరిగి చూశాడు పరంధామయ్యగారు. పీలగా ఒక స్త్రీ, సన్నగా ఒక పురుషుడూ; ముగ్గురు పిల్లలూ నిలబడివున్నారు.

"ఎవరు మీరు," అని గర్జించాడు పరంధామయ్యగారు.

"ఆరేళ్ళ క్రితం మీరు రాసిన నవలలో హీరోయిన్ని నేను. విలన్ చేతిలో నుంచి నేను విడిపించుకున్నాక ఈ సత్పురుషుడితో నాకు పెళ్ళిచేశారు మీరు. అక్కడితో నవల అంతం చేసిపారేశారు. కాని మా జీవితం ముగియలేదుకదా! ఆయనది చిన్న ఉద్యోగం. పరిస్థితి చాలా ఘోరంగా వుంది,' అంది హీరో యిన్ నీరసంగా.

పరంధామయ్యగారు వాళ్ళకాళ్ళూ వీళ్ళకాళ్ళూ పట్టుకుని హీరోయిన్ భర్తకు పెద్ద ఉద్యోగం వేయించాడు. ఆమె అప్పటినుంచీ కుటుంబనియంత్రణ పద్ధతులు అవలంబించి జీవితాన్ని సరిదిద్దుకుంది. వాళ్ళ జీవితాలు ఎంతో హాయిగా ఉన్నాయ్.

గోపాలచక్రవర్తి